# అన్నిటా చుక్కెదురే!

సుబ్బారావు హుషారుగా ఈల వేశాడు!

" ఇటు రావోయ్-ఇది చూడు!" అంటూ తను తిరగేస్తున్న తెలుగు పేపరులోని ఓ ప్రకటన భార్య లక్ష్మికి చూపించాడు.

భర్త ముఖంలోని సంతోషం గమనించి "ఏమటండీ అది?" అంటూ వచ్చి అతని ప్రక్క కుర్చీలో కూర్చుంది.

" ఒక షర్టు కొంటే రెండు షర్టులు ఫ్రీ! ఒక షర్టు మూడువందలు! లార్జ్ బజార్‌లో పెట్టారు ఈ ప్రత్యేక ఆఫర్...ఈవేళ సాయంకాలం ఆఫీసు నుండి వచ్చే టప్పుడు షర్టులు తెచ్చుకుంటాను...ఏమంటావ్?" అన్నాడు.

"తప్పకుండా తెచ్చుకోండి! కొత్తిగా అయిదు చొక్కాలతో గడిపేస్తున్నారు"అంటూ లక్ష్మి భర్తను ప్రోత్సహించింది. జేబులో అదనంగా మరో మూడు వందలు వుంచుకొని ఆఫీసుకు బయలు దేరాడు!

సుబ్బారావు మధ్యతరగతి జీవి. తన కష్టంతో జీవితంలో పైకి వచ్చాడు. విశాఖపట్నంలో గత అయిదు సంవత్సరాలుగా ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం ఇరవై వేల వరకూ జీతం తెచ్చు కుంటున్నాడు. మొదటి రెండు సంవత్సరాలలో జీతంలో ఆదా చేసి ఒక కుక్కరు, గ్యాస్‌పొయ్యి, నాలుగు కుర్చీలు, రెండు సీలింగ్‌ఫేన్లు, ఒక డబుల్‌కాట్ ; ఇలాంటి వస్తువులన్నీ సమకూర్చుకున్నాడు.ఆ తర్వాత మూడు సంవత్సరాల క్రితం రెండు గదుల పెద్ద ఇంట్లోకి మారి, తల్లితండ్రులు కుదిర్చిన సంబంధం లక్ష్మిని పెళ్ళి చేసుకున్నాడు.

లక్ష్మి అనుకూలవతి. భర్త పద్ధతులకూ, పొదుపు విధానాలకూ ముచ్చటపడి తాను కూడా అతడికి అన్ని విధాలా సహకరిస్తోంది. ఈ మూడు సంవత్సరాలలో ఒక డైనింగ్ టేబిలు, ఫ్రిజ్ లాంటి వస్తువులు కూడ సమకూర్చుకోగలిగారు.

సాయంకాలం భర్త ఆఫీసు నుండి వచ్చే వేళకు ఆత్రుతగా ఎదురు చూస్తూ కూర్చుంది! అంతలోనే సుబ్బారావు నీరసంగా అడుగులు వేసుకుంటూ ఇంట్లోకి వచ్చి చేతిలోని పల్చని కవరులో వున్న షర్టు టేబిలు మీద పడేశాడు" అదేమిటండీ? ఒక్కటే తెచ్చారేం? ఒకటి కొంటే రెండుఫ్రీ అని రాశారు కదా పేపర్లో?" అంటూ ఆత్రంగా అడిగింది లక్ష్మి.

నీరసంగా కుర్చీలో కూలబడుతూ అన్నాడు. "ఒకటి కొంటే రెండు ఫ్రీ మాట నిజమే! కానీ వాళ్ళదగ్గర కనీసం రెండువేలరూపాయల మేరకు కొనుగోలు చేస్తేనే 'ఫ్రీ'

సౌకర్యం వర్తిస్తుందట!మామూలుగా అయితే మూడు వందలకి ఒకటే షర్టు!"

" మరి ఆసంగతి ప్రకటనలో ఎక్కడా రాయలేదు కదా?"

"కౌంటరులో సేల్సు కుర్రాణ్ణి, నేనూ అదే విషయం అడిగాను. వాడు సొరుగులోంచి పేపరు తీసి ప్రకటన చూపించాడు.'ఒక్క షర్టు కొంటే రెండు షర్టులు ఫ్రీ' అని వున్న చోట ఒక చిన్న నక్షత్రంలాంటి చుక్కవుంది. ఆ చుక్కకి వివరణ ప్రకటన క్రింది భాగంలో ఒక మూలగా, చీమ తలకాయల్లాంటి అక్షరాలతో 'నిబంధనలు వర్తిస్తాయి' అని వుంది!" అన్నాడు దీర్ఘంగా నిట్టూరుస్తూ.

"షర్టు కొనుక్కోటానికి నిబంధనలు ఏమిటండీ? బాగుంది... మరీ అన్యాయం బాబూ..." అంటూ భర్తను సముదాయించి "కాఫీ తెస్తాను, వుండండి!" అంటూ లోనికి వెళ్ళింది.

రెండు నిమిషాల తర్వాత కాఫీ కప్పు భర్తకు అందిస్తూ "మరి ఎలక్ట్రిక్ రైస్‌కుక్కర్ సంగతి ఏం చేద్దాం? ఈ నెలలో ఊరుకుని, వచ్చే నెలలో తీసుకుందామా?" అంటూ అడిగింది.

లక్ష్మి ఎలక్ట్రిక్ రైసు కుక్కర్ కొనుక్కోవాలని మూడు నెలలుగా ఉబలాట పడుతోంది. రెండు రోజుల క్రితం పేపరులో 'రెండు వేల రూపాయల కుక్కరు పదిహేను వందలకే' అంటూ స్పెషల్ ఆఫర్ ఇచ్చాడు. అది కూడా నాలుగు రోజులు మాత్రమే! అంటే, రేపటితో గడువు అయిపోతుంది! గత రెండు రోజులుగా కుక్కర్ కొనే విషయం భార్యాభర్తల మధ్య నలుగుతోంది!

సుబ్బారావు కాఫీ త్రాగటం ముగించి కప్పు భార్యకు అందిస్తూ అన్నాడు. "రేపు సెకండ్ శాటర్ డే కదా! రేపు పొద్దుట వెళ్ళి తీసుకుందాం! కానీ, ఆ ప్రకటన పడిన పేపరు ఓసారి తీసుకురా? కుక్కర్ ఆఫర్ దగ్గర చిరు నక్షత్రం ఏదైనా వుందేమో చూడాలి! లేకపోతే, ఈ వేళ్టి లాగే దొరికి పోతాం!"

రెండు నిమిషాలలో ప్రకటన వున్న పేపరు వెదికి తెచ్చి భర్తకు ఇచ్చింది! అది పూర్తి పేజి ప్రకటన! రెండు అంగుళాల వెడల్పు గళ్ళల్లో రంగురంగుల్లో అనేక వస్తువుల ఫోటోలు ముద్రించారు. ప్రతి వస్తువు దగ్గరా అసలు ధర వేసి ఇంటూ మార్కు పెట్టి, ఆఫర్ ధర దగ్గర రైటు మార్కు పెట్టారు. ఎలక్ట్రిక్ రైసు కుక్కర్ బొమ్మగడిలో రెండు వేలు దగ్గర ఇంటూమార్కు, పదిహేనువందల దగ్గర రైటు మార్కు ముద్రించి వున్నాయి. దగ్గర్లో ఎక్కడా నక్షత్రాలు, చుక్కలూ కనబడలేదు. మరోమాటు ఇటూఅటూ వెదకి లక్ష్మితో అన్నాడు సుబ్బారావు."న్యాయమయిన ఆఫరు లాగే వుంది.రేపు వెళ్ళి తీసుకుందాం!"

లక్ష్మి ముఖంలో సంతృప్తి సంతోషం తొణికిసలాడాయి.

మర్నాడు పొద్దుట సుబ్బారావు టిఫిను తింటూ వుంటే, ఇంటిముందు ఆటో ఆగింది "నాయనా! బేగులు జాగ్రత్తగా దింపు!" అన్నతల్లి గొంతుక వినిపించి, తింటున్న టిఫిను ప్లేటు ప్రక్కగా పెట్టి గబగబా బయటకు వెళ్ళాడు.

"అమ్మా! ఫోన్ చెయ్యక పోయావా? నేను బస్‌కాంప్లెక్స్‌కి వచ్చే వాణ్ణి కదా!"అంటూ ఆటో వాడి దగ్గర నుండి బేగులు రెండూ అందుకున్నాడు. తల్లి ఇంట్లోకి నడుస్తూ"ఇదేం నాకు తెలియని ఊరా?మీ ఇల్లు నాకు తెలియని ఇల్లా? ఈ మాత్రం భాగ్యానికి నిన్నెందుకు ఇటూఅటూ తిప్పటం? రేపు రాత్రి ఈ వూళ్ళో మా మేనత్త మనవరాలి పెళ్ళివుంది!.. వాళ్ళు నీకు తెలీదులే.. మామేనత్త ఫోను చేసి రమ్మని మరీమరీ చెప్పింది... అందుకని పొద్దుటే అయిదు గంటలకి బస్సుఎక్కేశాను!" అంది.

ఈలోగా లక్ష్మి ఇంట్లోంచి మంచినీళ్ళగ్లాసు తీసుకువచ్చి అత్తగారికి అందించింది.

" అత్తయ్యగారూ.. మీ వంట్లో కులాసాగా వుంటోందా?" అంటూ.

" ఆహా! నిక్షేపంగా వున్నాను. తల్లీ!" అంటూ ఆవిడ కుర్చీలో కూర్చుంది.

" టిఫిను తెస్తాను!" లోపలికి నడుస్తూ అంది లక్ష్మి.

"అమ్మాయ్! నేనింకా స్నానం చెయ్యలేదు. స్నానం చేసి దీపం పెట్టుకుంటే గానీ, నేను ఏమీ తినను, నీకు తెలుసు కదా! నేను టిఫిను తిన్నాక నాకు వంటిల్లు అప్పజెప్పెయ్! మీకు పనులుంటే బయటకు వెళ్ళి చక్కబెట్టుకు రండి! ఈ వేళ రెండో శనివారం, శెలవే కదా!" అంటూ స్నానానికి లేచింది ఆవిడ.

"అమ్మా! ఈ రెండు రోజులు అయినా ఇక్కడ రెస్టుతీసుకో! లక్ష్మి వండి పెడుతుందిలే!" అన్నాడు సుబ్బారావు అప్యాయంగా.

"వంట కూడా ఓ పెద్ద పనేనా? అయినా, నాకు ఓపిక వున్నంత వరకూ నువ్వు కూర్చోమన్నా, ఖాళీగా కూర్చోలేను. ఓపిక తగ్గిపోయాక మాకిద్దరికీ ఎలాగూ మీరే చెయ్యాలి!" అంటూ కోడలితో బాటు లోనికి నడిచిందావిడ.

తల్లి స్నానానికి వెళ్ళిన తర్వాత అన్నాడు సుబ్బారావు "లక్ష్మీ! అమ్మ ఎలాగూ నిన్ను వంట చెయ్యనివ్వదు! ఆవిడ మడీ ఆచారాలకు భంగం రానివ్వకుండా ఈ రెండు రోజులూ వంట వ్యవహారం ఆవిడకి వదిలెయ్! లేకపోతే, ఆవిడ బాధపడుతుంది!"

"అయ్యో! నాకు తెలీదా ఆవిడ ఆచారాల సంగతి? పెళ్ళయిన కొత్తలో నెల్లాళ్ళు నేను అక్కడేవున్నాను. కదా! అయినా ఆవిడ పాటించే ఆచారాలు, మడీ, తడీ మనకు ఛాందసంగా కన్పించినా, వాటిలో ఎన్నో ఆరోగ్య సూత్రాలు ఇమిడి వున్నాయి కదండీ! ఆవిడకి ఏలోటూ రాకుండా చూసుకునే బాధ్యత నాది" అంది లక్ష్మి.

ఆమె మాటలకు సుబ్బారావు మనసు ఆనందంతో పులకించి పోయింది!

"థాంక్యూ లక్ష్మీ! థాంక్యూ! అమ్మకి వంటిల్లు అప్పజెప్పి నువ్వు పదకొండు గంటలకి రెడీ అయిపో! మనం వెళ్ళి రైస్‌కుక్కర్ కొని తెచ్చుకుందాం"

"అలాగే తెమిలిపోతాను!" అంది లక్ష్మి.

సుబ్బారావు లక్ష్మికి దగ్గరగా వచ్చి తగ్గు స్వరంలో అన్నాడు. "తేదీల ప్రకారం మన పెళ్ళిరోజు ఇంకా మూడు రోజులు వుంది.! కానీ తిథుల ప్రకారం ఈ వేళే! ఆ సంగతి మరిచి పోకు! సాయంకాలం మైసూర్ పాక్, మల్లెపూలు తెస్తాను! సెకెండ్ షో సినిమాకి వెళ్ళి 'సెలబ్రేట్' చేసుకుందాం!"

"ఊరుకోండి! మీకు నిత్యమూ సినిమా ధ్యాసే!" అంది ముసిముసిగా నవ్వుతూ.

★ ★ ★

సుబ్బారావు, లక్ష్మి ఇద్దరూ పదకొండు గంటలకు బయలుదేరి, మెల్లగా నడచుకుంటూ అందాల షాపింగ్‌మాల్'కి చేరుకున్నారు. షాపు జనంతో కిటకిటలాడి పోతోంది!

ఇద్దరూ మేడ ఎక్కి ఎలక్ట్రిక్ రైసుకుక్కర్ కౌంటర్‌కి చేరుకున్నారు.

"రైస్ కుక్కర్ చూపించండి! మొన్న పేపర్లో ప్రకటించారు కదా!" అంటూ అడిగాడు సుబ్బారావు.

" కూర్చోండి సార్!" అంటూ లోపల నుండి రెండు 'మోడా'లు తీసి బయట వేశాడు కౌంటరు లోపలి సేల్సుమేన్.

తర్వాత అల్మారాలోంచి ఓ అట్ట పెట్టె తీసి గబగబా దానికి వున్న టేపు లాంటి తాడు కత్తిరించి, పెట్టెతెరచి, అందులో పాలిథీన్ సంచిలో వున్న కుక్కర్‌ను బయటకు తీసి టేబులు మీద పెట్టాడు. తర్వాత ప్లగ్గు పిన్ను పవర్ పాయింటులో పెట్టి, స్విచ్ వేశాడు.

"ఇలా చెయ్యి పెట్టండి సార్!" అంటూ సుబ్బారావు చెయ్యి చొరవగా అందుకుని కుక్కర్ కిందభాగంలో ప్లేటు మీద పెట్టించాడు.

ప్లేటు వేడెక్కుతోంది! "బెస్ట్ అయిటమ్ సార్! ఏడాది గేరంటీ!" అన్నాడు.

"రేటు పదిహేను వందలే కదా?" అడిగాడు సుబ్బారావు.

"కాదుసార్! రెండువేలు! ఇది బ్రాండెడ్ అయిటమ్!"

"మరి పేపర్లో పదిహేను వందలని రాసారు కదా! ఈవేల్టి వరకూ ఆఫరు వుంది కదా!" అన్నాడు సుబ్బారావు కాస్త ఆందోళనగా.

"మీరు చెప్పింది కరెక్టేసార్ కానీ ఆ 'ఆఫర్' సరుకు వున్నంత వరకే! మాప్రకటన పేపర్లో వచ్చిన రోజు సాయంకాలానికే ఆ కుక్కర్లు రెండువందలూ అమ్ముడయిపోయా

అయినా అవి అన్ బ్రాండెడ్! ఇవి బ్రాండెడ్ సరుకు! అవి లూథియానా తయారీ! ఇవి గుర్‌గావ్ తయారీ!" అన్నాడు సేల్సుమేన్.

"మీరు పేపర్లో 'సరుకు వున్నంత వరకే!' అని ఎక్కడా రాయలేదు. కదా!"

"ఎందుకు రాయలేదు సార్" అంటూ సొరుగులోని పేపరు బయటికి లాగి మొత్తం ప్రకటన కింద భాగంలో 'నిబంధనలు వర్తిస్తాయి' అనే చీమ తలకాయల్లాంటి అక్షరాలు చూపించాడు. ఆ వాక్యం ముందు బుల్లి చుక్కలాంటి నక్షత్రం!

" మీ నిబంధనలు మాకెలా తెలుస్తాయి?" చికాకుగా అన్నాడు సుబ్బారావు.

" ఏ 'ఆఫర్' అయినా సరుకు వున్నంతవరకే సార్! సరుకు అయిపోతే మేం మాత్రం ఎక్కడ నుంచి తెచ్చి ఇవ్వగలం!... అయిదు వందల రూపాయలకి చూడకండి సార్!" అంటూ సన్నాయి నొక్కులు నొక్కాడు సేల్సుమేన్.

"ఏం చేద్దాం?" అన్నట్టు లక్ష్మి వంక చూసాడు. సుబ్బారావు.

"మీ ఇష్టం! మీరు ఎలా అంటే అలాగే!" గొణిగింది లక్ష్మి.

సుబ్బారావు ఓ నిమిషం ఆలోచించి "సరే! పేక్ చెయ్యండి!" అంటూ బిల్లు రాయించి, రెండు వేలూ ఆ కౌంటరులోనే పే చేసి, పేకెట్ తీసుకున్నాడు. ఇద్దరూ షాపులోంచి బయటకు వచ్చారు.

"ఈ నిబంధనల వ్యవహారం ఎక్కడకు వెళ్ళినా తప్పటంలేదు!" అన్నాడు.

"ఏమిటో! అంతా మాయ! అన్నిటికీ నిబంధనలే" అంది లక్ష్మి.

★ ★ ★

తల్లి వండిన ములక్కాడల కూర, తోటకూర మజ్జిగ పులుసుతో కడుపు నిండిపోవటంతో, భుక్తాయాసంతో మధ్యాహ్నం నిద్ర పట్టేసింది సుబ్బారావుకి! సాయంత్రం అయిదు గంటలకు తెలివొచ్చింది. గబగబా లేచి ముఖం కడుక్కొని బట్టలు మార్చుకున్నాడు.

"లక్ష్మీ! నేను రైల్వేస్టేషన్‌కు వెళ్ళి రిజర్వేషను చేయించుకు రావాలి! మా బాస్‌కి ఢిల్లీ టిక్కెట్లు తియ్యాలి!" అంటూ ఇంట్లోంచి బయలుదేరాడు.

సిటీ బస్సులో స్టేషన్‌కి చేరుకున్నాడు.

రిజర్వేషన్ కౌంటర్ల దగ్గర బాగా రద్దీగా వుంది.! క్యూలో నిలబడి టికెట్ తీసుకుని ఏడుగంటలకు బయట పడగలిగాడు!

స్టేషను బయట బస్సుస్టాపులో జనం కిటకిట లాడుతున్నారు.! క్యూలో నిలబడినా రెండు బస్సులు నిండే దాకా తాను బస్సు ఎక్కగలిగే పరిస్థితి కనబడలేదు! దగ్గరలో వున్న ఆటోని పిలిచాడు.

ఆటోవాడు వచ్చి మీటరువేస్తూ"ఎక్కండి సార్!" అన్నాడు.

బేరాలు చెప్పకుండా మీటరు వేసినందుకు సుబ్బారావు సంతోషించాడు.

"గురుద్వార సెంటర్‌కి పోనియ్! అడగకుండా మీటరు వేసిన ఆటోవాణ్ణి ఈ వూళ్ళో ఇన్నాళ్ళకి చూసేనయ్యా!..." అంటూ ఆటో డ్రైవర్ని మెచ్చుకున్నాడు.

"అలగాజనానికయితే బేరాలు చెబుతాం కానీ, మీలాంటి ఆఫీసర్లకి చెప్పం సార్!" అని చెబుతూ ఆటోడ్రైవరు; నకులుడు వర్షం చినుకుల మధ్య నుండి తప్పించుకుంటూ గుర్రాన్ని పరిగెత్తించినట్లు, జనాన్ని తప్పించుకుంటూ ఆటో తోలుతూ, పది నిమిషాలలో గురుద్వారా జంక్షను దగ్గర ఆపాడు.

సుబ్బారావు ఆటో దిగుతూ మీటరు వంక చూసాడు. ఇరవై నాలుగు రూపాయిలయింది. జేబులోంచి ఇరవై అయిదు రూపాయలు తీసి ఆటో డ్రైవరు చేతిలో పెడుతూ "చిల్లర వుంచుకో, ఫరవాలేదు" అన్నాడు దర్జాగా. నిజానికి తాను ఒక ఆఫీసరు కాకపోయినా ఆటో డ్రైవరు తనను అలా గుర్తించినందుకు ఆనందంగా వుంది! ఆ డబ్బు అందుకుంటూ డ్రైవరు తన సీటు వెనక భాగంలో తగిలించి వున్న ఓ అట్ట తీశాడు. దాని మీద పాతరేట్లు, కొత్తరేట్లు అంటూ రెండు విభాగాలుగా అంకెలు గజిబిజిగా వున్నాయి.!

వాడు అట్టమీద చూపుడు వేలు కదుపుతూ, ఇరవై నాలుగు రూపాయల ఎదురుగా అవతలి గడిలో వున్న అంకె ముప్పయి ఎనిమిది రూపాయిలు చూపిస్తూ ఇంకో పదమూడు రూపాయలివ్వండి!" అన్నాడు.

"మీటరు ఇరవై నాలుగు రూపాయలే కదా తిరిగింది" అంటూ గుటకలు మింగాడు.

"ఆరు నెలలోకోసారి గవర్నమెంటు డీజిల్ రేట్లు పెంచేస్తోంది. ప్రతిసారి మేం మీటర్లు మార్చలేం కదా! అందుకే మా ఆటో డ్రైవర్స్ యూనియన్ వాళ్ళు మాకు డీజెల్ ధర పెరిగినప్పుడల్లా, ఇలా కొత్త చార్టులు తయారుచేసి ఇస్తూవుంటారు. చార్టు ప్రకారమే మేము తీసుకోవాలి! ఇది మా నిబంధన" అన్నాడు డ్రైవరు తాపీగా.

"మీ నిబంధనలు మాకెలా తెలుస్తాయి? మాకు ముందే చెప్పాలిగా?" కాస్త కోపంగా అడిగాడు సుబ్బారావు.

"ఇదిగో! మీటరుమీద చూడండి! చిన్న స్టారు పెట్టి 'నిబంధనలు వర్తిస్తాయి' అంటూ స్టిక్కరు అతికించేం కదా!" అంటూ కాస్త దురుసుగా మాట్లాడుతూ, మీటరు పై భాగంలో అతికించిన ఓ స్టిక్కరు చూపించాడు.

ఇక వాడితో వాదించి లాభంలేదని తెలుసుకుని జేబులోంచి మరో పదమూడు రూపాయలు తీసి వాడికి సమర్పించుకున్నాడు.

గురుద్వారా జంక్షన్ లోని స్వీటుస్టాలులో అరకేజీ మైసూరుపాక్ పేక్ చేయించి,

పక్కనేవున్న పువ్వుల దుకాణంలో రెండు మూరల మల్లెపూలుకొని, రెండు పేకెట్లూ పట్టుకొని హుషారుగా ఇంటికి  వచ్చాడు సుబ్బారావు!

ముందు గదిలో కూర్చుని తల్లి భగవద్గీత చదువుకుంటోంది. గబగబా నడిచి లోనికి వెళ్ళాడు. పెరట్లో స్టూలు మీద కూర్చొని టేబిలు లేంపు వెలుగులో, ఏదో మేగజైనులోని 'గళ్ళనుడి కట్టు'  నింపుతోంది లక్ష్మి!

"తొందగా తెములు! సెకెండ్ షోకి వెళ్ళాలి కదా! ఇంకా ఇలాగే కూర్చున్నావా?" అంటూ చేతిలోని పొట్లం విప్పి మల్లెదండ ఇటూఅటూ ఊపుతూ దగ్గరగా వెళ్ళబోయాడు.! లక్ష్మి కంగారుగా లేచి నిలబడి రెండు అడుగులు వెనక్కి వేస్తూ ఆగండి!" అంటూ చేతిలోని పెన్నుతో పుస్తకం మీద ఏదో రాసింది!

తర్వాత నవ్వుతూ సుబ్బారావు వైపు చూసింది.

సుబ్బారావు చిన్నగా వంగి పుస్తకంలోకి చూశాడు!

చిన్న నక్షత్రం వుంది!

"ఏమిటో నక్షత్రం!" అంటూ అడిగాడు.

"పక్కన ఏం రాశానో చదవండి!" అంది లక్ష్మి ముసిముసిగా నవ్వుతూ.

"నిబంధనలు వర్తిస్తాయి..." అంటూ మెల్లగా చదువుతూ, లక్ష్మివంక అయోమయంగా చూశాడు.

"అబ్బాయి గారికి అర్థమయిందా! అత్తయ్యగారు ఇంట్లోనే వున్నారు కదా! అందుకని 'ఈమూడు రోజులూ 'నిబంధనలు వర్తిస్తాయి.!' దూరంగా వుండండి! ఆవిడ చూస్తే బాగుండదు!" అంది చిలిపిగా నవ్వుతూ.

"హతోస్మి!! అన్నిటా చుక్కెదురేనా?" అంటూ నీరసంగా గోడకి చేరగిల బడిపోయేడు సుబ్బారావు!! ★

(నవ్య వీక్లీ మార్చి 2012)